విజ్ఞాన్స్ లారా విద్యార్థులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని నాలుగో సంవత్సరానికి చెందిన 207 మంది విద్యార్థులు ప్రముఖ బహుళజాతి కోర్ కంపెనీలైన రామ్‌టెక్, ఇసూజు, మౌల్డ్ టెక్, మైల్ కాల్, సున్వి ఇంజినీరింగ్, ఎఫ్ఫాట్రానిక్స్, ఎక్సెల్‌టెక్ వంటి కంపెనీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో ఇప్పటికే 75 శాతంకి పైగా విద్యార్థులు ఒకటికి మించి ఉద్యోగ అవకాశాలు సాధించారని తెలియజేసారు. ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు గరిష్టంగా రూ.5.3 లక్షల వార్షిక వేతనం అందుకోనున్నారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులలో సీఎస్ఈ విభాగం నుంచి 25 మంది, ఈసీఈ విభాగం నుంచి 34 మంది, ఐటీ విభాగం నుంచి 6 మంది, ఈఈఈ విభాగం నుంచి 64, మెకానికల్ విభాగం నుంచి 49 మంది, సివిల్ విభాగం నుంచి 12 మంది, ఎంసీఏ విభాగం నుంచి 17 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్, ఉపాధి కల్పనాధికారులు, ఆయా విభాగాల అధిపతులు అభినందించారు.

ఖగోళ విజ్ఞాన శాస్త్రానికి ప్రతీక పంచాంగాలు

విశాలాంధ్ర-గుంటూరు : వేల సంవత్సరాల క్రితమే ఖగోళ విజ్ఞాన పరిశోధనలకు భారతదేశం పుట్టినిల్లుని, పంచాంగాల రూపకల్పనలో గ్రహాల కదలికలను బట్టి తిథి, వార, నక్షత్రాలను అంచనా వేయవచ్చునని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. ది గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీమాన్ శ్రీమత్ తిరుమల గుదిమెళ్ళ యతేంద్ర ప్రణవాచార్య సిద్ధాంతి వెలువరించిన శ్రీ శోభకృత్త నామ సంవత్సర పంచాంగాన్ని సంపత్‌నగర్‌లో మేయర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాలుగా భారతీయ సాంస్కృతిక జీవనంలో పంచాంగాలు ఖగోళ శాస్త్రంలోని శాస్త్రీయతను, ఖచ్చితమైన ప్రామాణికతలను అందిస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేష ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ, ఉపాధ్యక్షులు గర్రె శ్రీరాములు, బచ్చు వెంకటసుబ్బయ్య, గెల్ల రమేష్ కుమార్, కార్యదర్శులు వేమూరి వెంకట కామేశ్వరరావు, బచ్చు లక్ష్మి శ్రీనివాసరావు, పాదర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి అచ్యుత నిరంజన్, సభ్యులు కాకర్ల హనుమంతరావు, చుండూరు దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే 'వినియోగదారుల హక్కుల' రక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : దేశ జనాభాలో 65 శాతం పైగా ఉన్న యువత విద్యార్థులలో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారానే జరుగుతున్న అన్యాయాలపై పోరాడవచ్చునని ది గుంటూరు కన్స్యూమర్స్ కౌన్సిల్ కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల రక్షణ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఆర్థిక ప్రగతికి వినియోగదారుడే రారాజని అన్ని ప్రభుత్వాలు చెబుతున్న వాస్తవానికి చట్టాల రూపకల్పనలో అమలులో పాలకవర్గాల అధికారుల నిర్లక్ష్యం వల్లనే వినియోగదారుడు దారుణమైన దోపిడీకి గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికలు, కొలతలు, రవాణా వ్యవస్థలపై నియంత్రణ లోపించడం ద్వారా వినియోగదారుడు పెద్ద ఎత్తున నష్టపోతున్నాడని చెప్పారు. అనేక రకాల వస్తు తయారీలో టోల్ ఫ్రీ నంబర్లు ఇస్తున్నారని నాణ్యతలో లోపాలు ఉంటే టోల్ ఫ్రీ కస్టమర్ కేర్ నెంబర్లు లేదా వినియోగదారుల కోర్టుల ద్వారా సంబంధిత నష్టపరిహారాన్ని రాబట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి, రామకృష్ణారావు, విజయలక్ష్మి, నాయుడు చక్రనాగ్, నాయుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు అందని 'రేషన్'

విశాలాంధ్ర-మేడికొండూరు : మార్చి నెలలో రేషన్ బియ్యం అందక మేడికొండూరు మండలంలోని వేలాదిమంది వలస కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటింటికి రేషన్ సరుకులు ఇచ్చే వాహనం వద్దకు రేషన్ కోసం వెళ్ళిన వలస కూలీలకు అక్కడి సిబ్బంది నుంచి స్టాకు లేదనే సమాధానం రావడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో చేసేదిలేక అధిక ధరలు వెచ్చించి బియ్యాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వలస కూలీలు వాపోతున్నారు. పౌరసరఫరాల శాఖ, టాస్క్ ఫోర్స్ నిఘా కొరబడటంతో రేషన్ మాఫియా పేదల పొట్ట కొట్టి దొడ్డి దారిన నల్ల బజారుకు తరలిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. మంగళవారం గుజరాత్‌కు తరలిస్తున్న 34 టన్నుల రేషన్ బియ్యాన్ని మేడికొం డూరు పోలీసులు స్వాధీనం చేసుకోవడమే దీనికి ఉదాహరణ. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి మండలంలో నివసిస్తున్న వలస కూలీలకు రేషన్ ఇప్పించాల్సిందిగా వారు వేడుకుంటున్నారు.

CHANGE OF NAME

I, **CHALUVADI BALA VENKATA LAKSHMI SUDHEER** (Old Name) S/o. (Late) **CHALUVADI VENKATESWARLU**, R/o. D.No.5-37-145/2, Sudheer Nilayam, 4/17 Brodipeta, Guntur - 522002, Andhra Pradesh, India, have changed my name to **CHALUVADI BVL SUDHEER**. Hereafter my name is known as **CHALUVADI BVL SUDHEER.**

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India — आन्ध्रा Andhra — कार्पोरेशन Corporation

గుంటూరు మెయిన్ బ్రాంచి
గౌరీశంకర్ థియేటర్ రోడ్, కొత్తపేట, గుంటూరు-522001
ఫోన్స్: 0863-2351005, 2252654.
E-Mail : ubin0801500@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన. ... "అక్కడ ఏది ఉంటే అది" ... తేది.02-07-2019 నాటికి రూ.16,66,296.40 పై. ...

రిజర్వుధర : రూ.1,20,00,000/- ధరావత్తు సొమ్ము : రూ.12,00,000/- బిడ్ పెంపుదల : రూ.1,00,000/-

www.unionbankofindia.com

ప్రదేశం: గుంటూరు, తేది: 16-03-2023 — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు మెయిన్ బ్రాంచి

పది పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఏప్రిల్ 3వ తేది నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలక్టరేట్ లోని శంకరన్ హాల్‌లో పదవ తరగతి పరీక్షల ఏర్పాట్ల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ అండ్ ఫ్లైయింగ్ స్క్వాడ్స్, కస్టోడియన్స్, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేది నుండి 18 వ తేది వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 456 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 27,714 మంది విద్యార్థులు 138 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 11,788 మంది, ప్రైవేట్ పాఠశాలల నుండి 15,926 పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరిలో రెగ్యులర్ అభ్యర్థులు 26,384 మంది, కంపార్ట్ మెంట్ అభ్యర్థులు 1330 మంది వున్నారన్నారు. పరీక్షలు ఉదయం 09.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అర్ధ గంట ముందు నుంచి అనుమతిస్తారన్నారు. 09.30 గంటలకు మెయిన్ గేట్ మూసివేస్తారన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఫోటో ఐడెంటిటీ ఒరిజనల్ తప్పక తీసుకురావలసి ఉంటుందని తెలిపారు. ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరీక్షా హాల్ లోకి అనుమతించరన్నారు. చీఫ్ సూపరిం టెండెంట్ బేసిక్ ఫోన్ మాత్రమే వాడాలన్నారు. పరీక్షల నిర్వహణలో వున్న ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ధరించాలన్నారు. ఇన్విజిలేటర్లు విద్యార్థుల ఫోటో, సిగ్నేచర్ ఐడీ వెరిఫై చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీస్ శాఖాధికా రులకు సూచించారు. తరగతి గదుల్లో పరీక్షలు వ్రాయుటకు అనువైన టెబుల్స్ ఏర్పాటు చేయాలని డిఈఓకు సూచించడం జరిగింది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరం లేకుండా అధికారులు సమన్వ యంతో చర్యలు చేపట్టి పరీక్షలు సజావుగా నిర్వహిం చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కే. చంద్ర శేఖర రావు, డిఇఓ శైలజ, యంఈఓ ఖుద్దూస్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు : ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు బుధవారం నాజ్ సెంటర్ వద్ద ఉన్న ఇంటర్మీడియట్ రీజనల్ ఇన్‌స్పెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజీ పరీక్షా ప్రశ్నపత్రాల పంపిణీ విషయమై ఇంటర్మీడియట్ అధికారిణి జి.సునీతను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 73 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని, అన్ని కేంద్రాలకు వాహనాల ద్వారా ప్రశ్నాపత్రాలను సురక్షితంగా చేర్చామని వివరించారు. అనంతరం పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరీక్షా కేంద్రాల దృశ్యాలను కంట్రోల్ రూములోని టీవీలో కలెక్టర్ పరిశీలించి, పరీక్షలు సజావుగా ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు, డీఈసీలు సుధాకర్ బాబు, బాల మోహన్, పాండురంగా రావు పాల్గొన్నారు.

క్వింటా పసుపుకు రూ.10 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మండలంలో పసుపు పంట రైతాంగాన్ని రైతు సంఘ నాయకులు జొన్న శివశంకరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిశెంబర్‌లో కురిసిన వర్షాల వలన పంట దెబ్బతిని దిగుబడి 20 క్వింటాళ్ల లోపే ఉందని, ఖర్చులు ఎకరాకు రూ.1.20 లక్షలు, కౌలుతో కలిపి మొత్తం రూ.1.60 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. క్వింటా పసుపు ధర రూ.5500 మాత్రమే ఉందని, దీని వలన సుమారుగా రూ.50 వేలు పెట్టుబడిలోనే నష్టపోతున్నారని రైతులు తమ కష్టాలను రైతు సంఘ నాయకులకు చెప్పారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ రావు మాట్లాడుతూ గత జనవరిలో రూ.7 వేలుగా ఉన్న పసుపు ప్రస్తుతం రూ.5500-రూ.6 వేలు మాత్రమే ధర పలుకుతుందన్నారు. మద్దతు ధర రూ.6850లు ఉందన్నారు. క్వింటా పసుపు ధర రూ.10 వేలు, అలాగే ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పసుపు పంటకు కలగజేయాలని డిమాండ్ చేశారు.

దళిత గిరిజనుల సమస్యల పోరాటానికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో దళిత గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట దిశగా అఖిల భారత దళిత గిరజనుల సంక్షేమ సంఘం పనిచేస్తుందని ఆ సంఘం వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు డాక్టర్ మనవల ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన మందిరం నందు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు ఆంజనేయులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కూకట్లపల్లి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 26 జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు, సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏ పార్టీకి వ్యతిరేకం కాదని.. అలాగే ఏ పార్టీకి అనుకూలము కాదన్నారు. దళిత గిరిజనుల అభ్యుదయం, వారి జీవిత భద్రత కాపాడుటం అసోసియేషన్ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అండ్ ఫోర్స్‌మెంట్ సీఐ దాసరి బాలయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త మోటోరి జగపతి, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు అపరాధరుసుం రద్దు చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వార్షిక రిటన్స్ పన్ను చెలిపుదారులకు (జీఎస్టీ) అపరాధరుసుమును రద్దు చేయాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ బుధవారం లోకసభలో 377 క్రింద కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వార్షిక నివేదికలైన జీఎస్టీఆర్9, 9సీ4 మొదలగు వాటికీ లేటు రుసుములు లేకుండా కొన్ని పరిమితుల మేరకు వర్తింపచేయమని కోరారు. నోటిఫికేషన్ లేకుండా వ్యాపారస్తులకు నోటీసులు(లేట్ ఫి) ఇస్తున్నారని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. కోవిడ్, లాక్‌డౌన్ కారణంగా సమయానికి జీఎస్టీ రిటర్న్/ఫైనల్ రిటర్న్ దాఖలు చేయలేకపోయారన్నారు. వీరి కష్టాలను పరిగణనలోకి తీసుకుని, ఆలస్య రుసుమును మాఫీ చేయడం/తగ్గించడం ద్వారా ఉపశమనం అందించాలని కోరారు. జీఎస్టీ కౌన్సిల్ మినహాయింపు, 44(1) ప్రకారం వార్షిక రిటర్న్‌ను దాఖలు చేయడానికి అనుమతించవచ్చు కాబట్టి, ఈ వాస్తవమైన సమస్యను పరిశీలించి, సానుకూల తీర్మానం కోసం జీఎస్టీ కౌన్సిల్ ద్వారా సమస్యను తీర్చటానికి ఆర్థికమంత్రిని కోరారు.

మహనీయుడు కాన్షీరాం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బహుజనుల రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని మాన్యశ్రీ కాన్షీరాం అని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఏసీ కళాశాల వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంత రావు, బీసీ సంస్కృతిక కళామండలి రాష్ట్ర కన్వీనర్ ముప్పానా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళగిరి పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం 16వ మహాసభ మంగళగిరి పట్టణంలోని అంజుమన్ షాదీఖానాలో బుధవారం జరిగింది. మహాసభకు టి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు తన ప్రసంగం కొనసాగిస్తూ మంగళగిరి ప్రాంతంలో గత 45 సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం సంఘం ఏర్పడి పోరాటాలు చేసిందన్నారు. సంక్షేమ బోర్డు నెలకొల్పుట కోసం మంగళగిరి భవన నిర్మాణ కార్మిక సంఘం అలుపెరిగిన పోరాటం చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ వల్ల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల వల్ల ఇనుము, సిమెంటు తదితర అన్ని రకాల మెటీరియల్స్ రేట్లు పెరగడంతో పనులు తగ్గి కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి వారికి నష్టం కలిగిస్తుందని అన్నారు. కార్మికుల హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీ రాఘవులు, ఎస్ఎస్ చేంగయ, షేక్ జానీ భాష, వై.కమలాకర్, పి.బాలకృష్ణ, వి.పూర్ణయ్య, డి.శ్రీనివాసరావు, ఎం.శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. 29 మందితో పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికైంది.

చేయూత మహిళా మార్ట్‌ను సందర్శించిన జేసీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం : ఫిరంగిపురంలో ఇటీవల ప్రారంభించిన చేయూత మహిళా మార్ట్‌ను బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి సందర్శిం చారు. మహిళా మార్ట్‌లో విక్రయానికి ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. నాణ్యతలో రాజీపడకుండా ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు అందించాలని మార్ట్‌ను నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులకు సూచించారు. మార్ట్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వినియోగదారులను ఆకర్షించేలా నిత్యవసర వస్తువులను స్టాల్స్‌లో అందంగా ప్రదర్శించేలా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలోనే ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్‌ను త్వరలో ఏర్పాటు చేయబోయే మహిళా మార్ట్‌లకు రోల్ మోడల్‌గా వ్యాపారాభివృద్ధి పథంలో నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిరంగిపురం తహశీల్దార్ పద్మనాభుడు, చేయూత మహిళా మార్ట్ బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లోని మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల పరిశీలన

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలో పలు కళాశాలలో బుధ వారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను స్థానిక తహసిల్దార్ శ్రీకాంత్ కేదారినాథ్ పర్యవేక్షించారు. పట్టణంలోని సుజాత జూనియర్ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, పి బిఎన్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, కనీస సౌకర్యాలు కల్పన ఏర్పాట్లు గురించి కళాశాల యాజమాన్య ప్రతినిధులతో ఆయన చర్చించారు. విద్యార్థులకు కల్పించిన ఏర్పాట్లపై తహసిల్దార్ శ్రీకాంత్ కేదారినాథ్ సంతృప్తి వ్యక్తం చేశారు.

గడ్డి వామి దగ్ధం చేసిన దుండగులు

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణంలో యానాదుల కాలనీ రోడ్డు చివర ఎర్ర మస్తాన్ రెడ్డి కాలనీ ప్రాంతం లో మంగళవారం అర్ధరాత్రి భీమిరెడ్డి చిన్ని, శరణ్ కుమార్‌లకు చెందిన 90 ఎకరాల గడ్డివాముకు గుర్తుతెలియని అగంతకులు నిప్పు పెట్టారు. దీంతో గడ్డివామ మంటలు భారీగా ఎగసిపడటంతో స్థాని కులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావటంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.20 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. బాధిత పాడి రైతులు భీమిరెడ్డి చిన్ని, శరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్దేశ్య పూర్వకంగా తమపై కక్షకట్టి గడ్డివాముకు నాలుగు వైపుల నిప్పుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని వైసీపీ సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. రైతులపై ఇటువంటి చర్యలకు పాల్పడటం దుర్మార్గమని, పిరికిపంద చర్యగా అభివర్ణించి తీవ్రంగా ఖండించారు.

రేవతికి బంగారు పతకం



విశాలాంధ్ర-తెనాలి : 10వ ఏపీ స్టేట్ సీనియర్ క్లాసిక్ (మెన్ అండ్ ఉమెన్) పవర్ లిఫ్టింగ్ మరియు బ్రెంచిప్రస్ ఛాంపియన్ షిప్-2023న డా.బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మార్చి 11,12వ తేదీలలో జరిగిన పోటీల్లో తెనాలికి చెందిన వక్కలగడ్డ రేవతి 63 కిలోల సీనియర్ విభాగంలో తలపడి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆమెకు బోకే ఇచ్చి అభినందించారు. పట్టణంలోని ప్రముఖులు, ఏఎస్ఎన్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి సన్మానించారు.

ఓటమి భయంతోనే వైసీపీ మంత్రుల గావుకేకలు

విశాలాంధ్ర-గుంటూరు : జనసేన పార్టీ ఆవిర్భావ సభకు హాజరైన లక్షలాదిమంది జనసమూహాన్ని చూసిన వైసీపీ నేతలకు వెన్నులో వణుకు మొదలైందని, పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా ఓటమి భయంతోనే వైసీపీ మంత్రులు గావుకేకలు పెడుతున్నారని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, కారుమూరి నాగేశ్వరరావు, పేర్ని నాని, కరణం ధర్మశ్రీలు పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా మచిలీపట్నంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభతో వైసీపీ పతనం మొదలైందన్నారు. ప్రజా సమస్యలపై, వాళ్ళు నిర్వహిస్తున్న శాఖలపై ఏనాడూ మీడియా ముందుకు రాని మంత్రులు పవన్ కళ్యాణ్‌పై అవాకులు చెవాకులు పేలాటానికి మాత్రం క్యూ కడుతున్నారని విమర్శించారు. ఇన్నాళ్లూ కులాల మధ్య కుంపట్లు రాజేసి రాజకీయ చలి కాచుకుంటున్న నేతలకు కులాలు పక్కనబెట్టి ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రయత్నం కంటగింపుగా ఉందని ధ్వజమెత్తారు. అధికారంలో ఉండి ప్రజాధనాన్ని దోచుకోవడం దాచుకోవటమే పనిగా పెట్టుకొని ఎదుటివారిపై తిట్ల దండకంతో విరుచుకుపడటం మినహా ఈ నాలుగేళ్లలో ఈ రాష్ట్ర మంత్రులు సాధించిన ఘనత ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల అభిప్రాయాలు, ఆదేశాల మేరకే పవన్ కళ్యాణ్ నడుచుకుంటారన్నారు. రానున్న ఎన్నికల్లో పొత్తులు ఉన్నా లేకపోయినా జనసేన చేతిలో వైసీపీ చిత్తు చిత్తు అవ్వటం ఖాయమన్నారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్‌పై విమర్శలు మానుకొని ఉన్న కొద్దిపాటి పదవీకాలాన్ని అన్నా రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలని లేనిపక్షంలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

విశాలాంధ్ర-గుంటూరు : రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్లకు జిల్లాలోని యజమానులు ఈ నెల 31వ తేదిలోగా భూగర్భ జల, జల గణన శాఖలో రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా భూగర్భ జల అధికారి డి.వందనం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నీరు, భూమి, చెట్ల చట్టం-2002, 2004లోని నియమాలను అనుసరించి జిల్లాలోని డీటీహెచ్, రోటరీ, మినీ రోటరీ రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్ల యజమానులు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేసుకోవాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నిబంధనల మేరకు గడువులోగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయని రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్ల ద్వారా డ్రిల్లింగ్ చేపట్టినట్లయితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్య తీసుకుంటామన్నారు. యజమానులు నగరంపాలెంలోని ఇరిగేషన్ కాంపౌండ్‌లో ఉన్న భూగర్భ జల, జల గణన శాఖ కార్యాలయంలోని సంప్రదించవచ్చుని, వివరాలకు 0863-2230767 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గ్రామ రీ సర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర-మేడికొండూరు : గ్రామ రీసర్వే త్వరితగతిన పూర్తి చేయడానికి గ్రామ రైతులు, ఈనాందారులు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో భాగంగా మేడికొండూరు మండలం మంగళగిరిపాడు గ్రామాన్ని బుధవారం జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మంగళగిరిపాడు గ్రామ రైతులు, ఈనాందారులతో మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కరించబడని అనేక సమస్యలు ఈ రీసర్వే ద్వారా పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర రెడ్డి, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, సర్వే ఏడీ రూప్లా నాయక్, మేడికొండూరు తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన అధినేత బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటిం చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్ కిరణ్ అన్నారు. మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన జనసేన బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ చట్టసభలలో వచ్చే ఎన్నికలలో బీసీలకు 50 శాతం పైగా సీట్లు కేటాయిస్తామని బీసీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను నిలబెడతామని చెప్పి ప్రకటించినందుకు గాను వారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను తెలిపారు. బీసీలకు రావాల్సిన దామాషా నిష్పత్తి ప్రకారం వారి న్యాయబద్ధమైన వాటాని కోటాని స్థానిక సంస్థల ఎన్నికలలో నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు పెద్దపీట వేసి వారికి తగిన ప్రాధాన్యం కల్పించడంతోపాటు దశాబ్దాలు కాలంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించారని అన్నారు. బీసీలు జరుగుతున్న అన్యాయాల పట్ల బీసీ బంద్‌కి పిలుపునిచ్చినట్లయితే బీసీ బంద్‌ను జయప్రదం చేస్తామని చెప్పి సంఘీభావం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ వసతి గృహాన్ని మైనార్టీ శాఖకు కేటాయించడాన్ని ఖండిస్తూ నిరసన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ హయాంలో బీసీల కోసం నిర్మించిన వసతి గృహాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా మైనారిటీ శాఖకు కేటాయించడాన్ని ఖండిస్తూ గుంటూరు జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిసి నాయకులు ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసారు. అనంతరం బిసి వసతి గృహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో మైనార్టీ సంక్షేమాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే ముస్తఫా ఈ రోజున మైనార్టీల మీద కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బిసి వసతి గృహాన్ని ముస్తఫా మైనార్టీ శాఖకు కేటాయించడం... జగన్ రెడ్డి ఆమోదం తెలపటం బిసిల వ్యతిరేక ప్రభుత్వమని నిరూపితమైనదని అన్నారు. కావాలంటే మైనార్టీలకు బి.ఆర్ స్టేడియంలోని ప్రస్తుతం వినియోగంలో లేని శాప్ బిల్డింగ్ గాని, పక్కనే వున్నరెడ్ ట్యాంక్ బిల్డింగ్ ని గాని ప్రభుత్వ నిధులతో బాగుచేపించి మైనార్టీ శాఖకు కేటాయించాలి కానీ, బిసి విద్యార్థులు చదువుకొనే వసతి గృహాలను వేరే శాఖలకు కేటాయించడం ఎంతవరకు సబబు అని వాపోయారు. ఎమ్మెల్యే ముస్తఫా ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే బిసిలందరు పెద్ద ఎత్తున ఉద్యమించి ఈ ప్రభుత్వానికి, జగన్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లావుల అశోక్, తూర్పు నియోజకవర్గ బిసి విభాగం అధ్యక్షుడు మారాసు మురళి యాదవ్, గట్టి శ్రీనివాసరావు, గుంటి నరసింహారావు, మేకపోతుల సోమశేఖర్, సూరె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన : కోవెలమూడి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉంది అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. బుధవారం స్థానిక 29వ డివిజన్‌లో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకొని వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రత్యేక హోదా తెస్తా అన్నా జగన్ రెడ్డి ఆయనపై ఉన్న కేసులతో రాష్ట్రాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టి, పోలవరం కూడా నిర్మించలేని స్థితిలో ఉన్నారని, మద్య నిషేధం చేస్తా అని హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం మద్యం ఆదాయంతోనే రాష్ట్రాన్ని నడుపుతున్నారు అని, సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారు అని అన్నారు.కరెంటు చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్నారు అని,వాటిని సాకుగా చూపి వారికి పథకాలు రాకుండా చేస్తున్నారు అని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ మాబు సుభాని, రాంప్రసాద్, శివ, అమృతరావు, రఫీ , టోపీ సుభాని, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

మాన్యశ్రీ కాన్షీరాం జయంతి

విశాలాంధ్ర-వినుకొండ: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ 89వ జయంతి సభ వినుకొండ పట్టణ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వేల్పుల రాంబాబు మాట్లాడుతూ ఈ దేశంలో 85శాతానికి పైగా ఉన్న బహుజనులు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని అన్నారు. ఓట్లు మావే.. సీట్లు మావే నినాదంతో ఉత్తరప్రదేశ్లో రాజ్యాధికారాన్ని సాధించిన బహుజన యోధుడు కాన్షీరామ్ సేవలను కొనియాడారు. పేద కుటుంబంలో జన్మించిన కాన్షీరామ్ బహుజనులకు బీఎస్పీ అనే ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి కాంగ్రెస్, బిజెపి లాంటి పార్టీలకు మేమెంతో.. మా వాటా అంతా.. అని సవాల్ విసిరిన రాజకీయ మేధావి అని, ఆంధ్రప్రదేశ్లో కూడా బహుజన రాజ్య స్థాపన లక్ష్యంగా పని చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బహుజన కళా మండలి అధ్యక్షులు మందా వెంకట్రావు, బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మాసిపోకు రవికుమార్, నియోజకవర్గ జాయింట్ సెక్రెటరీగోపికృష్ణ యాదవ్, నియోజకవర్గ ట్రెజరర్ పత్రా వెంకటయ్య, బహుజన వాలంటరీ ఫోర్స్ వినుకొండ పట్టణ మాజీ కన్వీనర్ పల్నాడు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కంభంపాటి నాగ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసనలు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ, ఉద్యోగ, కార్మిక, రిటైర్డు, ఒప్పం దం, ఔట్సోర్సింగ్ ఉద్యో గుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాల్లో భాగంగా వినుకొండ ఆర్టీసీలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. అలాగే భోజన విరామ సమయంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణ ఉద్యోగ కార్మికుల సంఘాల సమస్యలు పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఈ నిరసనలు జరుపుతామని కార్మిక సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రామ్మూర్తి మృతి

విశాలాంధ్ర- రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మాదిరాజు రామ్మూర్తి(62) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఈనాడు, ఆంధ్రభూమి దినపత్రికలలో సుదీర్ఘ కాలం విలేకరిగా పనిచేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్ జర్నలిస్ట్గా కొనసాగుతున్నారు. గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీబీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్, టీడీపీ, వైసీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, పలువురు జర్నలిస్టులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పలు దినపత్రికలలో విలేకరిగా పనిచేసి పాత్రికేయ వృత్తికి వన్నెతెచ్చారని కొనియాడారు. ఆయన మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, పల్నాడు జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి, వైసీపీ మండల నాయకులు అన్నెం పున్నారెడ్డి, మేడికొండ శ్రీనివాసరెడ్డి, రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, పల్లెల గోవిందరెడ్డి, వడ్లమూడి శివరామయ్య, గడిపూడి నరసింహారావు, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జీవీ సాంబశివారెడ్డి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు, ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-శావల్యాపురం : దాతలు అందిస్తున్న సహయ సహకారాలను అందిపుచ్చు కుని క్రీడాకారులు మంచి ప్రతి భను కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు దాతలు అందించిన కీడా దుస్తులను, అర్థిక సహాయాన్ని బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్రస్థాయి బ్యాట్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య వారికి వసతి ఖర్చుల నిమిత్తం రూ.6 వేలు, అలాగే కనమర్లపూడి గ్రామానికి చెందిన ఓర్సు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారికి మనవడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు క్రీడాకారులకు రూ.6 వేలు విలువచేసే క్రీడా దుస్తులను అందజేశారని తెలిపారు. ఆర్థిక సహాయం, దుస్తులు అందజేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదాంఖాన్, భువనేశ్వరి, హలీమా పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 228 మంది హాజరు

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక మోడల్ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 237 మందికి గాను 228 మంది హాజరు అయినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు. బుధవారం జరిగిన ప్రథమ పరీక్షకు 9 మంది గైర్హజరు అయినట్లు తెలిపారు. మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. పరీక్షకేంద్రాన్ని తహశీల్దార్ జి.శ్రీనివాస్ పరిశీలించారు.

కల్తీ విక్రయాలపై కఠిన చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో కల్తీ వ్యాపార లావాదేవీలపై నిరంతర తనిఖీలు చేయడం, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ద్వారా పల్నాడు జిల్లాను కల్తీ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్లోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్లో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సమీక్ష, అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు వారి విధులకు అనుగుణంగా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నెలకు ఒక్కసారి అయినా వినియోగదారులకు జరుగుతున్న మోసాలపై జిల్లా స్థాయిలో ఆయా వ్యాపార నిర్వాహకులతోను, వినియోదారులకు కలిపి అవగాహన కల్పించాలని ఆదేశించారు. వినియోదారులు మోసపోతే అందుకు కారణం అయిన సంస్థలు, వ్యాపార లావాదేవీలు నిర్వహించే కంపినీలపై తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక సమాజంలో సాంకేతిక వ్యవస్థ వచ్చిన ఆన్లైన్ వ్యాపార లావాదేవీలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని అన్నారు. అడ్రస్ లేకుండా కంపెనీలు కోక్కల్లలుగా పుట్టుకొస్తున్నాయని వారు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. నెలలో ఒకరోజు పెట్టుకొని తూనికలు, కొలతల శాఖ(లీగల్ మెట్రాలజీ), ఫుడ్ అండ్ కంట్రోల్ శాఖ, సచివాలయ శాఖ ఉద్యోగులతో కలిసి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ కంపినీలు, ఆయిల్ కంపెనీలు, చౌక ధరల దుకాణాలు, కొనుగోలు కేంద్రాలు, వ్యాపార లావాదేవీలు జరిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి సకాలంలో విచారణ నిర్వహించి వచ్చిన ఫలితాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులు వచ్చినప్పుడు ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబర్ గోడ పత్రికలు, వినియోగదారుల అవగాహన పుస్తకాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల హక్కుల ఫోరం అధ్యక్షులు చేగు వెంకటేశ్వర రావు, మహిళా అధ్యక్షురాలు కృష్ణ కుమారి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులా: జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల : వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం రాజ్యమేలుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో కోట్లాది రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందన్నారు. బిల్లులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్ లారీలను ఏపీ నుంచి నాగార్జునసాగర్ చెక్ పోస్ట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు గత మూడేళ్ల నుంచి తరలించడం జరుగుతుందన్నారు. విషయాన్ని హెచ్చరించినా నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి గాడి తప్పిందన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు. గు ళ్లపాడులో వ్యక్తి మరణిస్తే కడసారి చూసేందుకు వెళుతున్న రక్త సంబంధీకులను సైతం పోలీసులు ఆంక్షలు గురించి వెళ్లకుండా చేయడం సహించరానిదన్నారు. ఇటీవల ఓ కేబుల్ టీవీ యజమానికి సంబంధించిన వాటాను స్వాధీనం చేసుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వాసంగా ఉన్నాయన్నారు. కోట్లాది రూపా యల ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్లు నాణ్యత లోపిస్తున్నాయని, కొన్నిచోట్ల రోడ్లు వేయకుండానే బిల్లులు చేసుకోవడం లేకపోదన్నారు. రానున్న కాలంలో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో కొమెర దురారావు, బాబు ఖాన్, మున్నా రాంబాబు యాదవ్, సాతులూరి కుమార్, నేరెళ్ల వీరస్వామి, గుండాల శ్రీనివాస్ యాదవ్, బూసాని వేణు, పంగులూరి పుల్లయ్య, పంగులూరి అంజయ్య, లింగా రమేష్, మంచికల్లు సీతారెడ్డి, మంచికల్లు వెంకటరెడ్డి, యాగ్రం పోల్ రెడ్డి, సైదరావు తదితరులున్నారు.

త్వరలో మండలంలో రీ సర్వే

విశాలాంధ్ర-రెంటచిం తల: మండలంలోని 8 గ్రామాలలో త్వరలో రీసర్వే పనులు ఆరంభిస్తు న్నట్లు గురజాల ఆర్డీఓ అద్దయ్య వెల్లడించారు. బుధవారం. సాయంతం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. పశర్లపాడు నుంచి రీసర్వే పనులు ఆరంభిస్తామన్నారు. ప్రతి రైతు ఆధార్ కార్డు, పాస్ ఫోటో, చరవాణి నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాదారు పాస్పుస్తకాలు ఆయా గ్రామాల వీఆర్వోలకు అందజేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో స్థానిక తహశీల్దార్ కే పుల్లారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ను కలిసిన డేవిడ్ రాజు, ప్రకాష్

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమీషన్ చైర్మన్, ఎమ్మెల్సీ కుంభ రవిబాబుని గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నియమించిన మేడ వెంకటేశ్వ రావు(పండు), గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మనుపాటి నవీన్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు విజయవాడలో సామూహిక ధర్నా

విశాలాంధ్ర-పెడన : ఈ నెల 17వ తేదీన విజయవాడలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద జరిగే సామూహిక ధర్నాను జయప్రదం చేయాలని పెడన మండల యూనియన్ అధ్యక్షుడు రాజారత్నం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో 86 వేల మంది పేద అట్టడుగు వర్గాల మహిళలు పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు తీవ్రభారంగా పడిందన్నారు. రాజ్మాల్ట్ (రాగిజావా) ఉదయం 8 గంటల 45 నిమిషాలకే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు. అయితే జగనన్న గోరుముద్ద పేరుతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని నిర్ణయం మంచిదే అయినా దానికి అనుగుణంగా మెస్ఛార్జీలు పెంచకుండా దేశవ్యాప్తంగా ఇస్తున్న మెస్ఛార్జీలతోనే ఈ పథకాన్ని కొనసాగించటం ఎలా సాధ్యం అవుతుందన్నారు. మహిళా కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కార్మికుల వేతనాలు పెంచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రతి విద్యార్థికి రూ.30 మెస్ ఛార్జీలు పెంచి, ఉచితంగా వంటగ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ సభ్యులు అందరూ విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అమరావతే రాజధాని...: సోము వీర్రాజు

విశాలాంధ్ర-గుడివాడ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతేనని, అందుకే ఈ ప్రాంతానికి అధిక నిధులు మంజూరయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. 25 ప్రాజెక్టుల నిర్మాణం ఈ ప్రాంతంలో చేపట్టినట్లు తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులుగా రూ.10వేల కోట్లు విడుదలైనట్లు చెప్పారు. కృష్ణాజిల్లా, గుడివాడలోని బీజేపీ కార్యాలయంలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ బలోపేతంపై పార్టీ జిల్లా కమిటీ సభ్యులతో సమావేశమై వారికి కొన్ని సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం దృష్ట్యా ఆంధ్రప్రదేశ్కు రూ.3లక్షల కోట్ల నిధులను మోదీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ నేతలు రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండ శ్రీరాజబాబు, అంగదాల సతీష్, వల్లపర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఇంటర్ బోర్డు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 134 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. తమ హాల్టికెట్ నెంబర్లు సరిచూసుకుని పరీక్షా కేంద్రాలలోకి వెళ్ళారు. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 48985 మంది హాజరవ్వాల్సి ఉండగా 47738 మంది హాజరయ్యారు. 1247 మంది గైర్హాజరయ్యారు. వివరాలు.... గుంటూరు జిల్లాలో 73 పరీక్షా కేంద్రాలలో 29922 మంది హాజరు కావాల్సి ఉండగా 29329 మంది హాజరయ్యారు. 593 మంది గైర్హాజరయ్యారు. పల్నాడు జిల్లాలో 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 14459 మందికి గాను 13955 మంది హాజరయ్యారు. 504 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా బాపట్ల జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలలో 4604 మందికి గాను 4454 మంది హాజరవ్వగా 150 మంది గైర్హాజరయ్యారు.

క్రీడాకారులను ప్రచార ఆర్భాటాలకు వాడుకుంటున్న మోదీ

విశాలాంధ్ర-పొన్నూరు : కాదేదీ కవితకనర్హం అన్న ట్లు, మోదీ ప్రచార పిచ్చికి అడ్డు అదుపూ లేకుండా పోయిందని, మోదీ కళా కారులనూ, క్రీడాకారు లనూ తన ప్రచార ఆర్భాటాలకు వాడుకుంటూ జుగుప్సా కలిగిస్తున్నారని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా శ్రీనివాస్ అన్నారు. బుధవారం 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' కార్యక్రమంలో భాగంగా పొన్నూరు పట్టణ పరిధిలోని 1, 2 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన జక్కా శ్రీనివాస్ మోదీ ప్రచారార్భాటాల్ని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాడిశెట్టి సాంబశివరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చలికొండ రవిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కూరపాటి సతీష్, గోపిశెట్టి సాయి, శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ ఫణి, రేవంత్ పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడు రామినేని మృతి

విశాలాంధ్ర-పొన్నూరు : బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ జాయింట్ సెక్రెటరీ, గొల్లమూడిపాడు మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు రామినేని వెంకయ్య చౌదరి(93) బుధవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పొన్నూరు మండలం గోళ్ళమూడిపాడులోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన కుమారుడు రామినేని కిషోర్ బాబు ప్రస్తుతం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులుగా ఉన్నారు. 1964 నుంచి 80 వరకు గోడముడిపాడు గ్రామ సర్పంచ్గా పనిచేశారు. కొంత కాలం పాటు బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రెటరీగా సేవలందించారు. లోక్ దళ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎలమంచిలి శివాజీ తదితర నాయకులు రామినేని వెంకయ్య చౌదరి స్వగృహంలోని ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గ సభ్యులతో పాటు ఆకుల జానకి బాబు, మునిపల్లె ఎంపీటీసీ వేల్పూరి శంకర్, తుమ్మల ఆనంద్ బాబు, పర్చూరు లక్ష్మణ చార్యులు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఆయన అంత్యక్రియలు గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు. వెంకయ్య చౌదరి మృతి పట్ల పొన్నూరు పట్టణ మండలంలోని ప్రముఖ నాయకులు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం లే అవుట్ లలో ఇళ్ళ నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఎంపీడీవో, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై, ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, యంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ళ పథకంలో ఉగాది నాటికి నిర్దేశించిన ఇళ్ళను ఖచ్చితంగా పూర్తి చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 7,175 గృహాలు పూర్తి అయ్యాయని, ఇంకా 6,166 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో వున్నాయన్నారు. ఆర్సీలో వున్న 753 గృహాలను ఈ నెల 22వ తేది నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు, యంపీడీఓ లు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశానికి తొలుత గ్రామ/వార్డు సచివాలయాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివ రామిరెడ్డి, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి పద్మావతి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, సిపిఓ శేషశ్రీ, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధన రావు, ఇరిగేషన్ ఎస్.ఈ బ్రహ్మయ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-నరస రావుపేట : జిల్లాలో బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్ష సరళిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ స్థానిక నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో పర్యవేక్షించారు. ఎస్ఎస్ఎన్ కాలేజీ చీఫ్ ఎగ్జామ్స్ సూపరిండెంటెంట్తో కలిసి పరీక్ష హాలును సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాలు, మెడికల్ టీములు, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండే విధంగా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలోని శ్రీసత్యసాయి కళ్యాణ మండపంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు పలుచూరి సుబ్బారావు తెలిపారు. ఈ శిబిరంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు విచ్చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. శిబిరంలో పాల్గొనే వారు తమ వెంట రేషన్, ఆధార్, ఓటర్, లేదా ప్రభుత్వం మంజూరు చేసిన ఏ గుర్తింపు కార్డుయైన తమ వెంట తెచ్చుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్ఐ శ్రీనివాసరావుకు సన్మానం

విశాలాంధ్ర-దుర్గి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెం ట్గా పనిచేస్తున్న నిమ్మల శ్రీనివాసరావు రెవిన్యూ ఇన్స్ఫెక్టర్(ఆర్ఐ)గా పదోన్నతి పొంది మాచర్లకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఆయనకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు సన్మానం తలపెట్టారు. కార్యాలయంలో బుధవారం శ్రీనివాసరావును పూలమాలలు, దుశ్శాలవాలతో తహశీల్దార్ జి.రమేష్ కుమార్, వీఆర్వోలు సన్మానించారు. సన్మానించిన వారిలో సర్వేయర్ పవన్ కుమార్, వీఆర్వోలు తగరం కోటేశ్వరరావు, ఎస్.కోటేశ్వరరావు, కిరణ్ కుమార్, రంగారావు, రత్నప్రకాష్, జానీభాష, సునీత, గంగమ్మ, డేటా ఎంట్రీ ఆప్రేటర్ అనిల్ శాస్త్రి, వీఆర్ఏలు చాట్ల ప్రకాష్, షేక్ కరీముల్లా ఉన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ముటుకూరు ఎస్సీ కాలనీలో మాన్యశ్రీ కాన్షీరాం 86వ జయంతిని చర్మకారుల సంఘం నాయకులు పులిమెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాన్యశ్రీ కాన్షీరాం 86వ జయంతిని ముటుకూరు ఎస్సీ కాలనీలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మాన్యశ్రీ కాన్షీరాం బడుగు బలహీనవర్గాలకు అంటరానితనం ఊరికి దూరంగా విసిరివేయబడిన వారికి రాజ్యాధికారం కావాలని 20 సంవత్సరాలు సైకిల్ యాత్రచేసి అందరిని ఏకంచేసి ఉత్తరప్రదేశ్లో రాజ్యాధికారం సాధించి బెహన్ జీ కుమారి మాయావతిని ముఖ్యమంత్రిని చేసి రాజసింహాసనం మీద కూర్చోబెట్టిన ఘనత మాన్యశ్రీ కాన్షరాంకే దక్కుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాలను తన భుజస్కందాలపై వేసుకుని రాజ్యాధికారాన్ని సాధించి అంబేద్కర్ నిజమైన వారసుడని కొనియాడబడిన మాన్యశ్రీ కాన్షీరాంను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడలలో నడిచి మనం కూడా అంబేద్కర్ వారసులుగా పనిచేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమములో పులిమెల పెద్ద వెంగయ్య, మాచర్ల అచ్చయ్య, మాచర్ల అమరయ్య, లూకయ్య, యోసేపు, బంకా నవీన్, ఏసుదానం, మరిబాబు, పులిమెల బుజ్జి, మరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆస్తుల జోలికొస్తే సహించం

విశాలాంధ్ర-వినుకొండ: క్రైస్తవుల ఆస్తుల జోలికి వస్తే ఊరుకోబోమని పట్టణ ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి అభివృద్ధి కమిటీ సభ్యులు హెచ్చరించారు. వినుకొండ క్రిస్టియన్ ఏ .బి .ఎఫ్. ఎం. ఎస్ ఆస్తుల ఆక్రమణలపై స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి లో అభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు పందుల సాల్మన్ రాజు తో పాటు కమిటీ సభ్యులు మాట్లాడారు. క్రైస్తవులు ఆస్తుల జోలికి వస్తే సహించబోమని హెచ్చరించారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన కొందరు ఆ ఆస్తి తమదంటూ ఏకంగా వాహనాలతో స్థలం లోకి చొరబడేందుకు ప్రయత్నం చేసారని చెప్పారు. దొంగ పత్రాలతోపాటుగా, ఫోర్జరీ సంతకాలతో ఆస్తి తమదంటూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఆ ఆస్తులు ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి కే చెందుతాయని ఈ విషయాన్ని ఆక్రమదారులు గుర్తించాలని హెచ్చరించారు. తమ ఆస్తులు రక్షించుకునేందుకు తామంతా ఏకతాటిగా ముందుకు నడుస్తామని. అవసరమైతే న్యాయపోరాటమే కాక ప్రాణ త్యాగమైనా చేస్తామన్నారు. తమ ఆస్తుల రక్షణలో స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తమకు మద్దతుగా నిలచినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. క్రైస్తవుల మనోభావాలు దెబ్బ తినేలా ఎవరు ప్రవర్తించిన సహించబోమని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మానుయేలు తెలుగు చర్చి సంఘ సభ్యులు మరియు పెద్దలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **RAMISETTY SUJATHA** (Old Name) W/o. **RAMISETTY ANJANEYULU**, R/o. D.No.7-2-16, Srirampuram, Narasaraopet, Palnadu District - 522601, Andhra Pradesh, have changed my name to **RAMISETTY VENKATA NAGA SUJATHA**. Hereafter my name is known as **RAMISETTY VENKATA NAGA SUJATHA.**

పురపరిపాలన శాఖ

వినుకొండ పురపాలక సంఘం

'ఇ.-ప్రొక్యూర్మెంట్' టెండరు నోటీసు

నిట్ నెం : 1275/2015/ఇ1 తేది : 15-03-2023

(1) పనిపేరు : వినుకొండ పురపాలక సంఘంనకు సంబంధించి 24 నెం.ల పనులకు సంబంధించి టెండర్ల స్వీకరణకు చివరి తేది/ సమయం. 21-03-2023, సాయంత్రం 04.00 గం. వరకు (2) సంబంధిత మునిసిపల్ కమీషనరు పేరు: శ్రీ బి.శ్రీనివాసులు, కమిషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం. 08646-273656, మున్సిపల్ ఇంజనీరు, వారి సెల్ నెం. 97042 22504 తదుపరి వివరములను http://tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

బి.శ్రీనివాసులు, కమిషనర్
వినుకొండ పురపాలక సంఘం

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర-పర్చూరు: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక బీఏఆర్ అండ్ టీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. పరీక్షలు జరిగే విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ పరీక్ష కేంద్రంలోని వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా జరిగేలా విధులు నిర్వహించాలని, కాపీలకు అవకాశం లేకుండా, నిర్వహణలో లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల ముఖ్య పర్యవేక్షకురాలు జి.రత్నకుమారి మాట్లాడుతూ ప్రథమ ఇంటర్ తెలుగు పరీక్షకు 118 మంది విద్యార్థులకు 104 మంది హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ వెంట తహాశీల్దార్ నెహ్రూబాబు, చీఫ్ సూపరిండెంట్ రత్నకుమారి, డిపార్టుమెంటల్ అధికారి టి.భవాని, డీఐఈఓ ఆంజనేయులు, ఎస్సై ఎన్‌సీ ప్రసాద్, అధికారులు ఉన్నారు.

బహుజన రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యం

విశాలాంధ్ర - చీరాల : బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర నాయకులు దుడ్డు భాస్కరరావు అన్నారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్సిరాం 89వ జయంతి సందర్భంగా చీరాల నియోజకవర్గ బీఎస్పీ పార్టీ కార్యాలయంలో జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ షేక్ షరీఫ్, జిల్లా ఇన్చార్జి చిట్టిమాల సంగీతరావు, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్, పట్టణ అధ్యక్షుడు బొమ్మల పరంజ్యోతి, నియోజకవర్గ కార్యదర్శి ఆమరి మహేంద్ర, నియోజకవర్గ ట్రెజరరి చీమకుర్తి వంశీకృష్ణ, నియోజకవర్గ నాయకులు కుంచాల పుల్లయ్య,శివ ప్రసాద్, వల్లేపు వాసు, తెళ్ళ లక్ష్మయ్య, నూనె మత్తయ్య, గోరా తదితరులు పాల్గొన్నారు.

పశు విజ్ఞాన బడిపై పోషకులకు అవగాహన

విశాలాంధ్ర - రేపల్లె : పశు విజ్ఞాన బడిపై పోషకులకు అవగాహన కల్పిస్తున్నట్లు రేపల్లె ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.నరేంద్ర బాబు తెలిపారు. మండలంలోని గుడికాయలంక రైతుభరోసా కేంద్రం వద్ద సర్పంచ్ ఉయ్యూరు లక్ష్మీ శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రభుత్వం పశు పోషకులకు అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం విర్బాక్ కంపెనీ రైతులకు ఉచితంగా ఇచ్చిన మందులు, మినరల్ మిక్సర్ దాణా, కాల్షియం పంపిణీ చేశారు. వైఎస్ఆర్ చేయూత క్రింద మండలంలో 205 గేదెలు లబ్ధిదారులకు అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, మీనాక్షి దేవి, బి.జగదీష్ కుమార్, కరీముల్లా, వాసు రైతులు పాల్గొన్నారు.

కాన్షీరాం పోరాటం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - రేపల్లె : బహుజనులకు రాజ్యాధికారం అందించేందుకు కాన్షీరామ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జై భీమ్ భారత పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు పేర్కొన్నారు. కాన్సిరాం 81వ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్షిరాం దేశవ్యాప్తంగా పర్యటించి బహుజనులను సమీకరించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు మాయావతిని కూర్చోబెట్టిన దీశాలి అని కొనియాడారు. జై భీమ్ భారత్ పార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ న్యాయవాది దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ ఈ దేశ జనాభాలో 80 శాతం ఉన్న బహుజన వర్గాలు ఓటర్లుగానే మిగిలిపోతున్నారని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సాంబ శివరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్ర బాబురావు, కట్టుపల్లి రాజ భూషణం గంజి పరిశుద్ధ రావు కారుమంచి ఆశీర్వాదం భోయన ఉయ్యూరు యార్లగడ్డ శ్రీనివాసరావు బసవరాజు జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివ క్షేత్ర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : సూర్యలంక శివ క్షేత్ర ఆలయం నిర్మాణం అద్భుత రీతిలో జరుగుతున్నదని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించి, పూజలు నిర్వహించి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మాట్లాడుతూ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవము మే నెల 12,13 తేదీలలో జరుగుతుందని తెలి పారు. శృంగేరి జగద్గురువులు ఆశీస్సులతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. కావున భక్తులందరూ సహకరించాలని కోరారు. ధర్మకర్తలు ఎం. దశరథ మహారాజు, జి. మూర్తి రాజు, స్తపతి గోపాలకృష్ణ, చిత్రకారులు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతుల అవగాహన

విశాలాంధ్ర - మార్టూరు : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలు వేసి భూసారం పెంచాలని అన్నారు. భూమిలో మినుములు పెసలు రాగులు ఉలవలు కందులు వేరుశనగలు సామలు అరిగెలు 12 నుండి 20 రకాల విత్తనాలు వేసి భూమిలో పోషకాలు పెంచాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ఉపయోగిస్తే ఎలాంటి వ్యాధులు సోకకుండా పూర్తి ఆరోగ్యంతో ఉంటారని బాపట్ల జిల్లా డిపిఎం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం దర్శిలో ఏర్పాటు చేశారన్నారు. వానపాము రైతులకు మిత్రులని వాటిని జాగ్రత్తగా పెంచుకోవాలన్నారు. వైయస్సార్సీపి నాయకులు వినుకొండ సుధాకర్,లలితమ్మ, సుధాకర్, శేషయ్య, వెంకటస్వామిపోతురాజు, చిరంజీవి మల్లేశ్వరి, ఏ అనూష సాంబయ్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని సూరవరపుపల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పర్చూరు నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమంచి వైసీపీ నాయకులకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం బందారుపల్లి రామచంద్రబాబు నూతన గృహ ప్రవేశానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అనంతవరం ఎంపిటిసి దొడ్డా బ్రహ్మానందం, సురవరపుపల్లె సర్పంచ్ సన్నెబోయిన వెంకటప్పయ్య, చింతపల్లిపాడు నాయకులు గోరంట్ల సాంబయ్య జంపాని కోటేశ్వర రావు,జంపాని కోటి సుబ్బారాయుడు గన్నవరం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి వేణు,తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచండి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - చీరాల : కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను ఆదానికి దోచి పెడుతుందని, దేశ సంపదను కాపాడి పౌరుల జీవన ప్రమాణాలు మెరుగు చేయాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య అన్నారు. బుధవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా విస్తృత సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె కరిముల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు కనీస వేతనం రూ.21000 అమలు చేయమంటే ఈ ప్రభుత్వాలు మాత్రం ఆయాలకు రూ.5 వేలు, ఆశా కార్యకర్తలకు పదివేలు జితాలిస్తూ చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ప్రజలపై అధిక ధరల భారం మోపి అంబానీ,ఆదానిలకు మాత్రం రాయితీలు కల్పిస్తున్నారని,ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచేసారని అన్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లకు అధికార ప్రభుత్వం పాల్పడి పెద్దల సభను అపహాస్యం చేసిందని నీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని అన్నారు. రాష్ట్రంలో దేశంలో నిరుద్యోగ సంఖ్య పెరిగి పోయిందని, కొత్త ప్రయివేటు కంపెనీలు రాలేదని ప్రభుత్వ ఉద్యోగాలు లేక దేశాన్ని నిరుద్యోగ భార త్‌గా మారుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, చీరాల కార్యదర్శి చిరుమల ప్రకాష్, బాపట్ల నియోజకవర్గ అధ్యక్షుడు సన్నమూరి శ్రీనివాసరావు, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి కెఎల్‌డి ప్రసాద్, రేపల్లె నియోజకవర్గ బాధ్యులు పి.భిక్షాలు, సివిల్ సప్లైస్ జిల్లా కార్యదర్శి బాసి పైడైయ్యా, ప్రభుత్వ పాఠశాల ఆయాల కన్వీనర్ జొన్నా దుల భారతి, స్ట్రీట్ వెండర్స్ జిల్లా కన్వీనర్ కోటేశ్వరరావు, గ్రానైట్ వర్కర్స్ నాయకులు అప్పారావు పాల్గొన్నారు.

'మత్తు'కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్

విశాలాంధ్ర-అద్దంకి : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అద్దంకి పట్టణ సీఐ ఎమ్.రోశయ్య అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు విద్యాసంస్థల్లో వేళ్ళూ సుకుపోతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్ట డమే లక్ష్యంగా ప్రారంభించిన సంకల్ప కార్యక్రమాన్ని బుధవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాపట్ల జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చి దిద్దే చర్యలలో భాగంగా బాపట్ల,ప్రకాశం జిల్లాల ఎస్పీలు సంయుక్తంగా సంకల్పం డ్రగ్‌కు వ్యతిరేకంగా పోరాటం అనే నూతన అవగాహనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ప్రధాన ఉద్దేశం విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పలితాలు,చట్టపరమైన చర్యలు,శిక్షలు,డ్రగ్స్ వ్యసనం నుంచి ఎలా బయటపడాలి తదితర అంశాల పట్ల అవగాహన కల్పిస్తారని అన్నారు. యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎప్పుడూ మంచి వాతావరణంలో ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకొని జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎక్కడైనా,ఎవరైనా మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా సంబంధిత పోలీస్‌స్టేసన్‌కు సమాచారం అందించాలని లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రఘుపతి పేర్కొన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్టణంలోని 21వ వార్డు శీలంవారిపాలెం సచివాలయం నుండి ప్రారంభం కాగా సచివాలయం అడ్మిన్ మధు శాసన సభ్యులకు స్వాగతం పలికారు. మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం భావన్నారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శీలంవారిపాలెం అమ్మవారి దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు కోఆర్డినేటర్ కె.పద్మా నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించి కోనా రఘుపతికి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మూడు సంవత్సరాల్లో పొందిన లబ్ధి వివరాల బ్రౌచర్‌ను కోనా రఘుపతి ప్రజలకు అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోనా రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలు అన్ని వర్గాల ప్రజలుకు మెలుచేయడమే తప్పా ప్రతిపక్షాలు లాగా ప్రజలను తప్పుదోవ పట్టించే ఆలోచనలు కాదన్నారు.ముఖ్యమంత్రి తలపెట్టిన కార్యక్రమాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు కోకి వీరవెంకట రాఘవ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కాగిత సుదీర్,కర్లపాలెం కిషోర్, నాయుడు జాలిరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ఇనగలురి మాల్యాద్రి, వడ్డిముక్కల దేవిడ్,పుష్పరాజ్యం, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తున్న నాటికలు

విశాలాంధ్ర - మార్టూరు : శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో 13వ రాష్ట్రస్థాయి నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆలోచింపచేశాయి. రెండో రోజు నాటికల్లో ముందుగా అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి శవరంజని నాటికలోని సన్ని వేషాల్లో గొప్ప మనుషులు కావాలంటే మంచి పనులు చేయాలని అది ప్రాథమిక సూత్రమనే విషయాన్ని తెలియజేశారు. రెండవ ప్రదర్శన కళానికేతన్ వీరన్నపాలెంవారి రాజా రాజా చోరులు నాటికలో సన్నివేశాలు డబ్బు కోసం ఎవరు ఎంతకైనా తెగించగలరు స్వంత వారైనా,పరాయి వారైనా డబ్బు వస్తుందంటే మనిషి ప్రాణం తీయడానికైనా వెనకాడబోరని విషయాన్ని చూపించారు. సమాజంలో అందరూ రాజులేనని డబ్బు వస్తుందంటే అందరూ చోరులేనని తాను సంపాదించిన డబ్బుకు అయిపోయిన మనిషి దాన్ని అర్జించడం కోసం అశుద్ధమైన అబగా ఆనందంగా భుజించే అనాగరిక స్థితికి మనిషి చేరాడని స్వార్ధంతో డబ్బు కోసం మంచిని మానవత్వాన్ని ప్రేమని దయని చంపే చంపేసుకుంటూ రాక్షసుల మారిపోతున్న నీ మనసుల్ని క్షమించాలని కథ సారాంశంగా ఉందన్నారు. మూడవ నాటిక సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం నాటికలో కళాకారుడి వల్ల దాన్ని ఆదరించే కళా హృదయులవల్ల ఏ కళారూపమైన తన ఉనికిని నిలబెట్టుకుంటుందని కళ్ళకు కట్టినట్టు నాటికలో ప్రేక్షకులను చూపించారు. మూడవరోజు గురువారం ప్రదర్శనలు తాడేపల్లి వారి వెండి అంచులు రెండో ప్రదర్శనగా కొ ప్పోళ్ళు వారి పక్కింటి మొగుడు, చివరి ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ క ట్రపాడు వారి ప్రక్షాళన నాటిక తోనాటిక పోటీలు ముగుస్తాయి.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామానికి చెందిన నాయుడు భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ మరణించారు. అలాగే నిజాంపట్నం గ్రామానికి చెందిన చెన్ను నాగేశ్వరరావు అకాల మరణం చెందారు. మరొకరు పార్టీ కార్యకర్త అయిన లంకె వెంకటేశ్వర్లు కూడా కాలం చెల్లి మరణించడంతో బుధవారం ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వరరావు (చంటి), మండల సచివాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్, బోటు యూనియన్ ప్రెసిడెంట్ కన్నా శ్రీనివాసరావు వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎప్పుడు అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ నాయుడు వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ 89వ జయంతి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వారసుడు మాన్యశ్రీ కాన్షీరామ్ 89వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జడ రవీంద్రబాబు మాట్లాడుతూ అట్టడుగునున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు అధికారం వస్తుందని నిరూపించిన గొప్ప మహనీయుడు కాన్షీరామ్ అని ఆయన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ కాన్షీరామ్ అడుగుజాడల్లో నడవాలని వారి ఆశయసాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దాసరి వెంకటశ్వరరావు, పూరేటి మాణిక్యారావు, మండే పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు,.

రబీ పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రైతులందరూ 2022 సంవత్సరంలో రెండవ పంటగా వేసిన పంట వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు బుధవారం రాంబట్లవారిపాలెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి చీరాల ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వీటికి సంబంధించిన వివరాలను రైతులకు వివరించారు.

పోషకాలున్న మత్స్య సంపదను ప్రజలకు చేర్చాలి

- కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర - బాపట్ల : అత్యధిక పోషకాలున్న మత్స్య సంపదను ప్రజలకు చేరువయ్యాలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె విజయ కృష్ణన్ చెప్పారు. మత్స్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో బుధవారం చీరాలలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ లో ఆమె సమావేశం నిర్వహించారు. మత్స్య సంపదను అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ అన్నారు. బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతం నుంచి లభ్యమయ్యే మత్స్య సంపదను మన జిల్లా, రాష్ట్ర ప్రజలు సరిగా వినియోగించు కోవడం లేదన్నారు. అత్యధిక పోషకాలు ఉన్న మత్స్య సంపదను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించా లన్నారు. ధరలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. లాంజ్ ఫిష్ యూనిట్లు మూడింటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి.సురేష్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, లక్షలాదిమంది పేద విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ప్రసంగించారు. పాఠశాలల విలీన ప్రక్రియతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమయంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని మూసివేత దిశగా చర్యలు చేపడుతుందన్నారు. దీంతో పేద ప్రజల ఉన్నత చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయన్నారు. పాఠశాలల విలీనం పేరుతో పాఠశాలలను మూసివేస్తూ ప్రభుత్వ విద్యకు మంగళం పాడుతుందన్నారు. ప్రభుత్వ ఆలోచనతో నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ విద్యాశాఖకు మంత్రిగా ఉన్నారన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చి వారికి అనుకూలంగా ఉన్న విషయాలను మాత్రమే సభ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. 2021 -22 సంవత్సరం విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో 44,29569 మంది విద్యార్థులు ఉంటే ఈ సంవత్సరం 40,31,239 మాత్రమే ఉన్నారు. సుమారు 3,98,330 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి బయటకు వెళ్లారని పేర్కొన్నారు. 2021-22 సంవత్సరానికి ఈ సంవత్సరానికి మధ్య 4 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటుకు వెళ్లారని వివరించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - కొరిశపాడు : డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్సై శివకుమార్ తెలిపారు. మండలంలోని శ్రీ శారద కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ప్రారంభించబడిన సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం చిన్నాభిన్నం అవుతుందని లక్ష్యాలను చేరుకోలేమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని తెలిపారు. మంచి వాతావారణంలో ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోని జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎవరైనా డ్రగ్ అడిక్షన్ నుండి బయట పడాలంటే పోలీస్ శాఖ నుండి సహాయం చేస్తామని వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్లో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయటం వంటివి చేస్తామని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా మాదకద్రవ్యాలను కలిగి ఉన్న విక్రయిస్తున్న లేదా సేవిస్తున్నారన్న సమాచారం తెలిసిన యెడల వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓకి లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నెంబర్ 8333813228 కు, యస్.ఇ.బి టోల్ ఫ్రీ నెంబర్ 14500 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం రుచి చూపిన చాణిక్యుడు కాన్షిరాం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బహుజన్ నాయక్, బహుజన రాజ్యాధికారం మార్గదర్శి మాన్యశ్రీ కాన్సిరాం 89వ జయంతి సభను ఘనంగా బహుజన సమాజ్ పార్టీ బాపట్ల మండలం హైదర్‌పేట కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మానవ హక్కులకు దూరంగా ఉంచబడిన పీడిత జనాలను విముక్తి చేయడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన జీవితం చివరి వరకు కృషి చేస్తే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారసత్వాన్ని అందిపుచ్చుకొని మరణించేవరకు పోరాడిన గొప్ప యోధుడు కాన్సిరాం అన్నారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి కొచ్చెర వినయ్ రాజు, బాపట్ల పట్టణ అధ్యక్షులు గండికోట నాగరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెండాల ఝూ న్సీ, గడ్డం ఏలియా పాల్గొన్నారు.

పంట నమోదుపై అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో 2022 రబీ సీజన్లో రైతులు సాగు చేసిన పంటలను రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ క్రాఫ్ట్ నమోదు చేశారని పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే తక్షణమే రైతు భరోసా కేంద్రాల్లో తెలపాలని మండల వ్యవసాయ అధికారి ఎస్విపి కుమారి తెలిపారు.బుధవారం మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదుపై సోషల్ ఆడిట్ కొరకు రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పేర్లు డిస్ప్లే చేశామన్నారు. పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీలోపు రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే 20వ తేదీ లోపు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు దరిశి రామకృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు మిన్నకంటి రామారావు, వీఆర్వో సాయి విమల్, పంచాయతీ కార్యదర్శి జయగాయత్రి, విఏఏ వెంకాయమ్మ, రైతులు పాల్గొన్నారు.

వీరారెడ్డి కుటుంబానికి 'కరణం' శుభాకాంక్షలు

విశాలాంధ్ర - యద్దనపూడి : వైఎస్ఆర్ సీపీ నాయకులు కరణం వెంకటేష్ మండలంలో గన్నవరం సురవరపుపల్లె గ్రామంలో పర్యటించారు. గన్నవరం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వీరారెడ్డి కుమార్తె దివ్య తేజస్వి వివాహం ఈనెల 17న జరుగుతున్నందున సందర్భంగా గన్నవరం గ్రామము వచ్చి వారి కుటుంబ సభ్యులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. సూరవరపు పల్లె గ్రామానికి చెందిన బందారుపల్లి రామచంద్ర బాబు నూతన గృహప్రవేశం ఈనెల 17న ఉన్నందున ముందుగా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు సోమేపల్లి బాబు ధూళిపాళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు పంగులూరు క్రీడాకారుడు ఎంపిక

విశాలాంధ్ర - జె.పంగులూరు : అంతర్జాతీయ ఖో ఖో పోటీలకు పంగులూరు గ్రామానికి చెందిన క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి ఎంపికయ్యాడు. ఈనెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో జరిగే అంతర్జాతీయ ఖో ఖో పోటీలు 4వ ఏషియన్ గేమ్స్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌కు భారతదేశం జట్టు తరఫున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి పంగులూరులోని ఎస్.ఆర్.ఆర్. ఖోఖో అకాడమీకి చెందిన అట్ల శివనాగిరెడ్డి ఎంపికైనట్లు ఖో ఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ క్రీడాకారుడు అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో కోచింగ్ క్యాంపులో ఉన్నాడని తెలిపారు. 16 దేశాల నుండి క్రీడాకారులు పాల్గొనే ఈ అంతర్జాతీయ 4వ ఏషియన్ గేమ్స్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ కు పంగులూరు కు చెందిన ఎస్.ఆర్.ఆర్. అకాడమీ క్రీడాకారుడు ఎంపిక అవడం పట్ల గర్వంగా ఉందని సీతారామిరెడ్డి అన్నారు. ఈ క్రీడాకారుడు గత పది సంవత్సరాల నుండి పంగులూరులోని ఎస్.ఆర్.ఆర్ ఖో ఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. యాజల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, పంగులూరు లోని మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఇంకొల్లులోని డిసిఆర్‌ఎం డిగ్రీ కాలేజీలో డిగ్రీ, గుంటూరులో బిపిఈడి పూర్తి చేసి, ప్రస్తుతం చీరాల ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చిన్నతనం నుండే ఖో ఖో క్రీడపై ఆసక్తి ఉన్న శివ నాగిరెడ్డి పంగులూరులోని ఎస్.ఆర్. ఆర్. ఖో ఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శివ నాగిరెడ్డి తండ్రి రాఘవరెడ్డి ,తల్లి వెంకటేశ్వరమ్మ వీరిది వ్యవసాయ కుటుంబం. వీరికి ఖోఖో క్రీడపై ఉన్న ఆసక్తితో కుమారుడిని అప్పటి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రంగాచార్యులు సహకారంతో, సీతారామిరెడ్డి దగ్గరకు పంపి అకాడమీలో చేర్చారు.

ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకూడదు

- కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర - బాపట్ల : ఇంటర్మీడియట్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్ తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో పర్చూరులోని బి.ఏ.ఆర్.అండ్ టి.ఏ. జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 115 జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. 8,759 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. 10,474 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నారని, రెండు సంవత్సరాలు కలుపుకొని మొత్తం 19,237 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని 34 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. పరీక్షలు సజావుగా సాగడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రెండు నియమించగా, మరో రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - చెరువు జమ్ములపాలెం

బాపట్ల మండలం

ఆర్.ఓ.సి.నెం.15/2023 **టెండర్ ప్రకటన** తేది :15-03-2023

బాపట్ల జిల్లా, బాటప్ల మండలం , చెరువు జమ్ములపాలెం గ్రామపంచాయతీకి ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన సామాన్లు సప్లయి చేయుటకు సీలు వేసిన టెండర్లు, ఈ దిగువ సంతకము చేసిన వారిచే **ది.23-03-2023 తేదీన గురువారం ఉదయం 11.00గంటల** వరకు స్వీకరించబడి, అదేరోజు **సాయంత్రం 3.00గంటలకు** హాజరు అయిన టెండరుదారుల సమక్షమున తెరువబడును. టెండర్ దాఖలు చేయువారు టెండర్ ధరావత్తు చెల్లించి, రశీదు పొంది టెండరుకు జతపరచవలయును. ఇతర వివరములకు ఆఫీసు పనిచేయు వేళలయందు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొనవచ్చును.

ప.నెం.	సప్లయి చేయవలసిన సామాను వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	2023-24 సం॥నకు పబ్లిక్ హెల్త్ సామానులు సప్లయి చేయుట	200
2	2023-24 సం॥నకు పి.డబ్ల్యు.ఎస్. సామానులు సప్లయి చేయుట	200
3	2023-24 సం॥నకు వీధిలైట్లు, కరెంటు సామానులు సప్లయి చేయుట	200
4	2023-24 సం॥నకు స్టేషనరీ సామానులు సప్లయి చేయుట	100
5	2023-24 సం॥నకు ఎలక్ట్రీషియన్ కొరకు	100
6	2023-24 సం॥నకు టెండర్ పారిశుద్ధ్య సిబ్బంది కొరకు	100
7	2023-24 సం॥నకు టెండర్ అటెండర్ కొరకు	100
8	2023-24 సం॥నకు టెండర్ ఇంజన్ డ్రైవర్ కొరకు	100

సం/- పంచాయతీ కార్యదర్శి
చెరువు జమ్ములపాలెం